బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న రాకేశ్‌ తివారీ, ఆదర్ల మహేశ్‌ తదితరులు

గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా గౌలిపురా సీఐబీ క్వార్టర్స్‌లోని నల్ల పోచమ్మ ఆలయ ఆవరణలో బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రికను బుధవారం సంఘ సేవకులు, మాజీ ఉమ్మడి ఆలయాల అధ్యక్షుడు రాకేశ్‌ తివారీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్‌ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాకేశ్‌ తివారీ మాట్లాడుతూ.. తెలంగాణలో బోనాల ఉత్సవాలు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు జీపీ సురేశ్‌ కుమార్, బ్రహ్మానందం, పి.ఇమానియేల్, పి.రాంమూర్తి, కె.ప్రభాకర్, కె.దేవేందర్, ఎ.దయానంద్, శివ కుమార్, రఘు, రవి, సుధీర్, రుక్కయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు జె.చిరంజీవి, కన్వీనర్‌ పండరీనాథ్, వేణు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీత కళల వైపు యువతను ప్రోత్సహించాలి


నాట్య గురువులను సన్మానిస్తున్న బీసీ కమిషన్‌ చైర్మన్‌ వకుళాభరణం

గన్‌ఫౌండ్రీ: నేటి తరం చిన్నారులను శాస్త్రీయ సాంప్రదాయ సాంస్కృతిక కళల వైపు ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌ చైర్మన్‌ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం రవీంద్రభారతిలో శ్రీ మయూరి నృత్యాలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువందన నృత్యాంజలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో యువత పెడదోవపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బాల్యంలో నేర్చుకున్న కళ జీవిత ఉన్నతికి దోహదపడుతుందని తెలిపారు. అంతకు ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వివిధ కళా సంస్థలకు చెందిన ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు లయన్‌ డాక్టర్‌ ఎస్పీ.భారతి, వనపర్తి జిల్లా అడిషనల్‌ ఎస్పీ తేజావత్‌ రామ్‌దాస్, సినీనటి రాగిణి, యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, సీనియర్‌ జర్నలిస్టు నస్రీన్‌ఖాన్, శ్రీ మయూరి నృత్యాలయ నిర్వాహకులు ఆర్‌ఎస్‌ఎస్‌.రామ్‌కుమార్, రాజనాల శ్రీదేవి, రాజనాల నందిత పాల్గొన్నారు.

కాశీ-అయోధ్య యాత్రకు అంతా సిద్ధం


ఐడీ కార్డులను అందజేస్తున్న పంకజ్‌ కుమార్‌

చార్మినార్‌: నార్నల్‌ అగర్వాల్‌ కమిటీ హైదరాబాద్‌–సికింద్రాబాద్‌ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి కాశీ–అయోధ్య యాత్రలను నిర్వహించనున్నామని కమిటీ చైర్మన్‌ పంకజ్‌ కుమార్‌ అగర్వాల్‌ తెలిపారు. బుధవారం సాయంత్రం యాత్రలో పాల్గొనే వారందరికీ ఐడీ కార్డులను అందజేశామన్నారు. చరిత్రలో తొలిసారి తాము ఐదు రోజుల పాటు ఈ యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 20న పాతబస్తీ నుంచి కాశీ వారణాసికి చేరుకొని 22న గంగా స్నానం, 23న అయోధ్యలోని శ్రీ సరయుజి నదిలో స్నానం చేసి రామ్‌లల్లా దర్శనం చేసుకొని మార్కాపూర్‌ ద్వారా నగరానికి చేరుకోనున్నామన్నారు.

సీజనల్‌ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


డాక్టర్‌ మజహరుల్లా

గోల్కొండ: సీజనల్‌ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ మజహరుల్లా అన్నారు. సీజనల్‌ వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే అవి ప్రమాదకరంగా మారి ప్రాణాలు కూడా బలిగొంటాయని ఆయన అన్నారు. దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులతో పాటు ఇతర రకాలైన వ్యాధులు ఉన్న వారు వెంటనే తమ వద్దకు వస్తే అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. అవసరమైన వారికి రోగనిర్ధారణ పరీక్షలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా తమ ఆసుపత్రికి వచ్చే ఔట్‌ పేషంట్ల సంఖ్య పెరుగుతుందని ఆయన తెలిపారు. ఆసుపత్రి ఫార్మసీలో మందుల కొరత లేదన్నారు. 24 గంటలు పని చేసే ఐసీయూ విభాగం కూడా ఉందని ఆయన అన్నారు.

ఫుట్‌పాత్‌ ఆక్రమణదారులపై ఎఫ్‌ఐఆర్‌ నమోదు


ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు

నాంపల్లి: ట్రాఫిక్‌ పోలీసులు ఫుట్‌ఫాత్‌ ఆక్రమణదారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. వ్యాపారం చేస్తున్న వారిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తూ ట్రాఫిక్‌ అడ్డంకులను తొలగిస్తున్నారు. నాంపల్లి రైల్వే స్టేషన్, ఏక్‌మినార్‌ మసీదు, ఏ–వన్‌ సిగ్నల్, తాజ్‌ ఐల్యాండ్, బజార్‌ఘాట్, దర్గా రోడ్డు ప్రాంతాల్లో గడచిన రెండు రోజుల్లో 20 మందికి పైగా ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. అలాగే నంబరు ప్లేట్‌ లేకుండా తిరుగుతున్న వాహనదారులపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. నంబరు ప్లేట్‌పై నంబరు సరిగా లేని వాహనాలపై చర్యలు తీసుకుని వారికి కౌన్సెలింగ్‌ ఇస్తూ వాహనానికి నంబరును సరిచేసిన తర్వాతే వారికి వాహనాలు ఇస్తున్నారు. ప్రతిరోజూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ట్రాఫిక్‌ ఉల్లంఘనులపై కేసులు నమోదు చేస్తున్నారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు



సంతోష్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో..


జంగల్‌ విఠోభ ఆలయం వద్ద..

సుల్తాన్‌బజార్‌: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం గౌలిగూడలోని జంగల్‌ విఠోభ ఆలయంలో భక్తులు పోటెత్తారు. జాంబాగ్‌ కార్పొరేటర్‌ రాకేష్‌ జైస్వాల్, బేగంబజార్‌ కార్పొరేటర్‌ శంకర్‌ యాదవ్‌ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కిషన్‌ యాదవ్, పాండు యాదవ్, రఘునందన్, వెంకటరమణ, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

జియాగూడలో..

జియాగూడ: తొలి ఏకాదశి వేడుకలను పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జియాగూడలోని రంగనాథ స్వామి ఆలయంలో భక్తులు ఉదయం నుంచే పోటెత్తారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అఖండ హారతి, భక్తులకు దర్శన సౌభాగ్యం కల్పించారు. రహింపురాలోని శంకర్‌జీ హనుమాన్‌జీ ఆలయంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. జాలిహనుమాన్‌లోని సాలగ్రామ బాలాజీ ఆలయంలో కూడా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.


జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో..

సంతోష్‌నగర్‌లో..

సంతోష్‌నగర్‌: సంతోష్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి విశ్వక్సేన ఆరాధన, శుద్ధి పుణ్యాహావచనం, రక్షాబంధనం, అష్టోత్తర శతఘటాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి అనిల్‌ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు మహా నివేదన మంగళాశాసనం శాత్తుమర్రై, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

- ప్రశాంతంగా మొహర్రం ఊరేగింపు
- అడుగడుగునా స్వాగతం పలికిన ప్రముఖులు


బీబీకాఆలంకు స్వాగతం పలుకుతున్న సీనియర్‌ బీజేపీ నాయకుడు జి.హనుమంతరావు

చార్మినార్‌: పాతబస్తీ ప్రధాన వీధుల్లో కొనసాగిన మొహర్రం సామూహిక ఊరేగింపు బుధవారం రాత్రి 9.30 గంటలకు ప్రశాంతంగా ముగిసింది. రూపవతి అనే ఏనుగుపై బీబీకా ఆలంను షియా ముస్లింలు సామూహిక ఊరేగింపుగా తరలించారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు డబీర్‌పురాలోని బీబీకాఅలావా నుంచి ప్రారంభమైన పదో మొహర్రం సామూహిక ఊరేగింపు చార్మినార్, గుల్జార్‌హౌస్, పంజేషా, మీరాలంమండి, పురానీ హవేలీ, దారుషిఫా ద్వారా చాదర్‌ఘాట్‌ వరకు కొనసాగింది. ఇస్లాం మతం పరిరక్షణ కోసం కర్బలా యుద్ధ మైదానంలో అశువులు బాసిన హజ్రత్‌ ఇమాం హుస్సేన్‌ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ షియా ముస్లిం ప్రజలు నల్లటి దుస్తులు ధరించి దారి పొడవునా రక్తాన్ని చిందించారు.

పలువురి స్వాగతం...

పలువురు అధికార, అనధికార ప్రముఖులు స్వాగత వేదికలపై నుంచి ఆలంకు స్వాగతం పలికి పూలు, దట్టీలు సమర్పించారు. మీరాలంమండి వద్ద భాగ్యనగర్‌ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి రాజ్యసభ సభ్యుడు మందడి అనీల్‌కుమార్‌ యాదవ్, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషన్‌ ఇనిస్టిట్యూషన్స్‌ సొసైటీ వైస్‌ చైర్మన్‌ మహ్మద్‌ ఫహీం ఖాద్రీ, మాజీ కార్పొరేటర్‌ వాజిద్‌ హుస్సేన్‌ బీబీకాఆలంకు స్వాగతం పలికి పూలు,దట్టీలు సమర్పించారు. అలాగే మరో స్వాగత వేదికపై నుంచి బీజేపీ సీనియర్‌ నాయకులు జి.హనుమంతరావు ఆలంకు స్వాగతం పలికి పూలు, దట్టీలు సమర్పించారు.

జామా మజీదులలో..

గోల్కొండ: ముస్లింలు భక్తిశ్రద్ధలతో మొహర్రం సంతాప దినాలను నిర్వహించారు. బుధవారం మొహర్రం పదో రోజు ఆషూర్‌ఖానాలు, జామా మజీదులలో మొహర్రంపై ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. యువజన సంఘాల వారు పవిత్ర కర్బాల మైదానంలో వీరమరణం పొందిన అజ్రత్‌ ఇమామ్‌ అతని అనుచరులు మృతికి సంతాపంగా షర్బత్‌ వితరణ చేశారు. హుమాయూన్‌నగర్‌లోని ఎన్‌ఎండీసీ, మెహిదీపట్నం మెయిన్‌ రోడ్డు, టోలిచౌకీ చౌరస్తా, గోల్కొండ రిసాల బజార్‌ తదితర ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో షర్బత్‌ వితరణ చేశారు. ఆలంలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. గోల్కొండ దిలావర్‌షానగర్‌లోని అక్తరీ మసీదులో కర్బాల యుద్ధంపై ప్రత్యేక సంతాప కార్యక్రమం జరిగింది. అఖిల భారత మత గురువుల సంఘం నాయకుడు, ఆల్‌ ఇండియా ఖీరత్‌ కమిటీ అధ్యక్షుడు మౌలానా సయ్యద్‌ మతీన్‌ ఆలీషా ఖాద్రీ ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వచ్చి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మౌలానా మసూద్, మౌలానా నూర్‌ తదితరులున్నారు.

యాకుత్‌పురాలో అన్నదానం..

యాకుత్‌పురా: మొహర్రం బీబీ కా అలవా ఆలంల ఊరేగింపు సందర్భంగా బుధవారం యాకుత్‌పురాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన తాగునీటి, అన్నదాన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌ పాల్గొన్నారు. యాకుత్‌పురా రైల్వేస్టేషన్, బడాబజార్, గంగానగర్‌ నాలా, షేక్‌ ఫయాజ్‌ కమాన్, ఎత్తేబర్‌ చౌక్, పంజేషా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్ని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానం చేశారు. రెయిన్‌బజార్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ వసీవుద్దీన్, మజ్లిస్‌ నాయకులు పాల్గొన్నారు.

షర్బత్, తాగునీరు పంపిణీ..


మదీనా వద్ద ఆహార పదార్థాలు అందజేస్తున్న మహమ్మద్‌ ఇలియాజ్‌ బుకారి

చార్మినార్‌: పాతబస్తీ ప్రధాన రోడ్డులో బుధవారం జరిగిన మొహర్రం సామూహిక ఊరేగింపునకు మదీనా సర్కిల్‌లోని మహమ్మద్‌ క్యాప్‌ మార్ట్‌ యజమాని మహమ్మద్‌ ఇలియాస్‌ బుకారి ఘనంగా స్వాగతం పలికారు. ఊరేగింపులో పాల్గొన్న వారికి ఆహార పదార్థాలు, షర్బత్, తాగునీరు, ఐస్‌ క్రీం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇస్లాం మతం పరిరక్షణ కోసం కర్బలా యుద్ధ మైదానంలో అశువులు బాసిన హజ్రత్‌ ఇమామ్‌ హుస్సేన్‌కు సంతాపంగా నిర్వహించిన ఈ సామూహిక ఊరేగింపునకు ప్రభుత్వం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు.


మాట్లాడుతున్న మతీన్‌ఆలీషా ఖాద్రీ


ఆలంలకు ప్రార్థనలు


అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌


చార్మినార్‌ వద్ద టీజీఎస్‌పీడీసీఎల్‌ ఎస్‌ఈ మోహన్‌రెడ్డి, డీఈ లింగయ్య తదితరులు


డబీర్‌పురా బీబీకాఅలావాను సందర్శించిన విజయారావు, వినోద్‌ భార్గవ్, నాగేందర్‌కుమార్‌

మజ్లిస్‌ సెక్యులర్‌ పార్టీ


ఎంపీ అసదుద్దీన్‌ ఒవైసీతో మజ్లిస్‌ నాయకులు

గోల్కొండ: మజ్లిస్‌ సెక్యులర్‌ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండే ఏకైక పార్టీ అని ఎంపీ అసదుద్దీన్‌ ఒవైసీ అన్నారు. మెదక్‌ జిల్లాకు చెందిన పలువురు మజ్లిస్‌ నాయకులు ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ ఆధ్వర్యంలో బుధవారం ఆయనను కలిశారు. మెదక్‌లో జరిగిన ఘర్షణల సందర్భంగా అరెస్టు అయిన మజ్లిస్‌ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండి బెయిల్‌ ఇప్పించేందుకు సహాయ పడిన ఎంపీకి వారు కృతజ్ఞతలు తెలిపారు.

పెళ్లి బరాత్‌లో కత్తితో డ్యాన్స్‌ చేసిన వ్యక్తికి రిమాండ్‌

సంతోష్‌నగర్‌: పెళ్లి బరాత్‌లో కత్తితో డ్యాన్స్‌ చేస్తున్న ఓ వ్యక్తిని సంతోష్‌నగర్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్‌ రఘువీర్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..సంతోష్‌నగర్‌ దర్గా బర్హన్‌ షా ప్రాంతానికి చెందిన అబ్దుల్‌ రహీం (42) ఈనెల 5న రాత్రి 9 గంటలకు సంతోష్‌నగర్‌ నయారా పెట్రోల్‌ బంక్‌ రాజీవ్‌నగర్‌ లేన్‌లో బంధువుల పెళ్లి బరాత్‌లో కత్తితో డ్యాన్స్‌ చేశాడు. దీంతో ఈ డ్యాన్స్‌ వీడియో సోషల్‌ మీడియాలో వైరల్‌ అవుతుండటంతో సంతోష్‌నగర్‌ ఎస్సై పి.రవి, సిబ్బంది కేసు నమోదు చేసుకొని అబ్దుల్‌ రహీంను అరెస్ట్‌ చేసి కత్తిని స్వాధీనం చేసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించారు.

అన్నివర్గాల సంక్షేమమే కాంగ్రెస్‌ పార్టీ ధ్యేయం

అబిడ్స్‌: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్‌ పార్టీ ధ్యేయమని రాష్ట్ర కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌ యాదవ్‌ పేర్కొన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం రావడంతోనే ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. ఇటీవల కాంగ్రెస్‌ పార్టీలో చేరిన సీనియర్‌ నాయకులు ఎస్‌.ధన్‌రాజ్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం అరవింద్‌కుమార్‌ యాదవ్‌ మాట్లాడుతూ..పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో ఏ ఒక్క రైతుకు మాజీ సీఎం కేసీఆర్‌ రైతు రుణమాఫీ ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానం ప్రకారం..రూ.2 లక్షల రైతు రుణమాఫీ ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్‌ సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.


ధన్‌రాజ్‌ను సత్కరిస్తున్న అరవింద్‌కుమార్‌ యాదవ్‌

అమ్మవార్లకు కల్లు సాక, ఒడిబియ్యం సమర్పణ


తొట్టెల ఊరేగింపులో మల్లేష్, జ్ఞానేశ్వర్‌ తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోటపై కొలువుదీరి ఉన్న జగదాంబిక అమ్మవార్ల దర్శనానికి బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. పాత నగరానికి చెందిన మాతేశ్వరి ఉమ్మడి ఆలయాల వృత్తిదారుల సంఘం వారు బుధవారం అమ్మవార్లకు కల్లుసాక, ఒడి బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించారు. సంఘం ప్రతినిధి మల్లేష్‌ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా మాతేశ్వరి అమ్మవార్లకు సేవలు చేస్తున్నామన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా మాతేశ్వరి ఆలయం తరఫున ప్రతి యేటా తాము గోల్కొండ ఎల్లమ్మ తల్లికి కల్లు సాక, ఒడి బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, మహేష్‌బాబు, పాండు, లలిత, బీజేపీ టోలిచౌకీ డివిజన్‌ అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి తదితరులున్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి


మత్స్య దర్శినిని సందర్శించిన చైర్మన్‌ మెట్టు సాయికుమార్‌

అబిడ్స్‌: మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని రాష్ట్ర ఫిషరీష్‌ ఫెడరేషన్‌ చైర్మన్‌ మెట్టు సాయికుమార్‌ పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందన్నారు. బుధవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మత్స్య దర్శినిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సాయికుమార్‌ మాట్లాడుతూ..కొనుగోలుదారులకు మత్స్యదర్శిని వద్ద తక్కువ ధరలకు చేపలు, రొయ్యలు, పీతలతో పాటు రక రకాలైన చేపలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. దళారులకు ఎలాంటి తావులేకుండా కాంగ్రెస్‌ ప్రభుత్వం అర్హులైనవారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని సాయికుమార్‌ పేర్కొన్నారు.

గోషామహల్‌లో బీఆర్‌ఎస్‌ పటిష్టం


కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్‌ నాయకుడు ఆనంద్‌కుమార్‌ గౌడ్‌

అబిడ్స్‌: గోషామహల్‌ నియోజకవర్గంలో ఎవరు పార్టీలు మారినా బీఆర్‌ఎస్‌ పటిష్టంగా ఉందని నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌ గౌడ్‌ పేర్కొన్నారు. బుధవారం మంత్రి కేటీఆర్‌ను కలిసి గోషామహల్‌ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ స్థితిగతులను వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ ఆనంద్‌కుమార్‌ గౌడ్‌కు పలు సూచనలు చేశారు. బీఆర్‌ఎస్‌ నుంచి ఇతర పార్టీలకు వెళ్లేవారిని పట్టించుకోవద్దన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ ఎప్పుడు ప్రజల పక్షమని ఆయన అన్నారు. ఆనంద్‌కుమార్‌ గౌడ్‌ మాట్లాడుతూ..గోషామహల్‌ నియోజకవర్గం నలుమూలలా ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్‌ పోరాటం చేస్తుందన్నారు. నియోజకవర్గంలో మొదటి నుండి ప్రజా అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ముందున్నామన్నారు.

డ్రైవర్ల సంఘం నేతలకు సన్మానం



నాంపల్లి: సిక్కింలో జరిగిన ఆలిండియా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రజతోత్సవ మహాసభకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నేతలు హాజరయ్యారు. ఆలిండియా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం సౌత్‌ జోన్‌ చైర్మన్‌ సర్దార్‌ మంజీత్‌ సింగ్‌ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్లు సిక్కిం వెళ్లారు. మంగళవారం జరిగిన మహాసభకు సిక్కిం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్‌ తమన్‌ గోయల్‌ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సాయంత్రం డ్రైవర్లతో కలిసి సీఎం ప్రేమ్‌సింగ్‌ తమన్‌ గోయల్‌ భోజనం చేశారు. అనంతరం ఆలిండియా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నేతలకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నేతలకు సీఎం మెమొంటోలు అందజేశారు. సిక్కిం రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్‌ ఉద్యోగి ఆడబిడ్డలకు ఎంబీబీఎస్‌ చదివించడానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని అభయం ఇచ్చినట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉపాధ్యక్షులు ఈరవేణి పద్మారావు ముదిరాజ్‌ పేర్కొన్నారు. అసోసియేట్‌ అధ్యక్షుడు పంతులు శ్రీనివాస్, కోశాధికారి సయ్యద్‌ హాసం హుస్సేని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈరవేణి పద్మారావు ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి నర్సింగరావు, అలీమ్, సంయుక్త కార్యదర్శి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు గోల్కొండ కోటలో 4వ పూజ

గోల్కొండ: నేడు గోల్కొండ కోటలో జగదాంబిక మహంకాళి అమ్మవారికి 4వ బోనం పూజ జరుగుతుందని ఆలయ కార్యానిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఆయన 4వ బోనం ఏర్పాట్లపై జరుగుతున్న వివరాలను వెల్లడించారు. గోల్కొండ కోటలో వివిధ శాఖల ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

జానపద కళాకారుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా విజయశ్రీ


విజయశ్రీని అభినందిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా విజయశ్రీ నియమితులయ్యారు. బుధవారం సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్‌ కేవీ రమణాచారి ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ పాల్గొన్నారు.

మినీ బస్సు దగ్ధం

విజయనగర్‌కాలనీ: మినీ బస్సు దగ్ధమైన ఘటన టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ ఎ.రాములు తెలిపిన వివరాల ప్రకారం..కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ఆనుకుని ఓ మిని బస్సు పది రోజుల నుంచి అక్రమంగా పార్కు చేసి ఉంచారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో బస్సులో అకస్మాత్తుగా మంటలు అంటుకుని దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు టప్పాచబుత్ర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. లంగర్‌హౌస్‌ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జికా వైరస్‌పై అవగాహన అవసరం


డాక్టర్‌ తారకేశ్వరీ

అఫ్జల్‌గంజ్‌: జికా వైరస్‌పై గర్భిణులకు అవగాహన అవసరం ఫెర్నాండేజ్‌ ఆసుపత్రి చీఫ్‌ మెడికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ తారకేశ్వరీ పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం ఇటీవల జికా వైరస్‌ కేసులు పెరిగాయని హెచ్చరించారన్నారు. తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో జికా వైరస్‌ ప్రభావం ఉంటుందన్నారు. ఎవరికైనా దద్దుర్లు, జ్వరం, కండరాలు, కీళ్లనొప్పులు, కండ్ల కలక వంటి లక్షణాలు కనిపిస్తే జికా వైరస్‌గా గుర్తించవచ్చన్నారు. గర్భాధారణ సమయంలో తల్లి నుంచి పిల్ల దాకా జికా వైరస్‌ వ్యాపిస్తుందన్నారు. ఆర్‌టీ పీసీఆర్‌ పరీక్ష ద్వారా జికా వైరస్‌ను గుర్తిస్తామన్నారు.

ఘనంగా జంగల్‌ విఠోభా ఆలయ వార్షికోత్సవం



అఫ్జల్‌గంజ్‌: గౌలిగూడలోని జంగల్‌ విఠోభా ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఆలయ ప్రాంగణంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌ కుమార్‌ యాదవ్, గోషామహల్‌ ఎమ్మెల్యే రాజాసింగ్, శ్రీ విద్యా శంకర భారతి శాస్త్రి స్వామి, ప్రేమ్‌సింగ్‌ రాథోడ్, బండారు విజయలక్ష్మి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.